టీడీపీ నాయకుడి అండతో దర్జాగా కబ్జా

- అధికారులు ఎన్నికల విధుల్లో వుండగా ప్రభుత్వ భూమి ఆక్రమణ
- మధురవాడ సర్వే నంబరు 27లో 12 షెడ్ల నిర్మాణం
- ఆక్రమణల తొలగింపును ప్రతిఘటించిన స్థానికులు



కొండపై ఆక్రమణకు చదును చేసిన ప్రభుత్వ భూమి పరిశీలిస్తున్న అధికారులు



ఆక్రమణలు పరిశీలిస్తున్న ఆర్ఐ ప్రవీణ్ కుమార్

మధురవాడ : అధికార యంత్రాంగం అంతా ఎన్నికల విధుల్లో ఉండగా సందట్లో సడేమియా అన్నట్టు కొందరు గుట్టుగా ప్రభుత్వ భూమి ఆక్రమించేశారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 27లోని శివశక్తినగర్ రోడ్డులోని శ్రీలక్ష్మీనగర్‌లో కొందరు సుమారు అర ఎకరం స్థలంలో 12 ఆర్‌సీసీ రేకుల షెడ్లు చకచకా నిర్మించేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి తోడు జీవీఎంసీ 5వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడి అండతోనే కోట్లాది రూపాయల విలువ చేసే స్థలం ఆక్రమణకు గురైంది. కొండను ఆనుకుని ఉన్న ఇళ్లకు ఎదురుగా ఉన్న స్థలం... ఎవరి ఇంటికి ఎదురుగా ఉన్నది వారిది అన్నట్టు పోటీ పడి మరీ షెడ్లు నిర్మించేసుకోవడం విశేషం. నిర్మాణాలు అన్నీ పాతవే అని అధికారులను నమ్మించేందుకు ఆక్రమణదారులు తెలివిగా వ్యవహరించారు. పాత ఇటుకలు, వాడేసిన తలుపులు, కిటికీలు, ఇతర సామగ్రిని స్క్రాప్ దుకాణాల్లో కొనుగోలు చేసి మరీ పక్కా ప్రణాళికతో నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ తతంగం అంతా పది రోజులుగా జరుగుతున్నా రెవెన్యూ, జీవీఎంసీ యంత్రాంగం ఏ ఒక్కరూ కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జీవీఎంసీ 5వ వార్డుకి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడే రాజకీయ లబ్ధి కోసం వీరితో షెడ్లు నిర్మించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు మాత్రం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తొలగింపు చర్యలు ప్రతిఘటించిన స్థానికులు

ప్రభుత్వ స్థలం ఆక్రమించి షెడ్లు నిర్మించిన విషయంపై జేసీ, ఆర్‌డీవో, ఇతర ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు బుధవారం నిద్రలేచారు. నలుగురు పోలీసు సిబ్బంది సాయంతో బుధవారం సాయంత్రం పొక్లెయిన్‌ను తీసుకొచ్చి ఆక్రమణలు తొలగించేందుకు పూనుకున్నారు. విషయం ముందే తెలుసుకున్న ఆక్రమణదారులు పొక్లెయిన్‌కు అడ్డంగా కూర్చుని తొలగింపును ప్రతిఘటించారు. తామంతా పేదలమని, వీటిని తొలగిస్తే తాము రోడ్డున పడతామంటూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో చేసేది లేక అధికార యంత్రాంగం వెనుదిరిగారు. ఈ సందర్భంగా విశాఖ రూరల్ మండల ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తించామని, తొలగింపు చర్యలను ఆక్రమణదారులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతామన్నారు. అయితే ఎన్నికల్లో లబ్ధి కోసమే అంతా తాము చూసుకుంటామని టీడీపీ నాయకులు స్థానికులతో షెడ్లు నిర్మించినట్లు తెలుస్తోంది.



ఆక్రమణల తొలగింపునకు తీసుకొచ్చిన పొక్లెయిన్‌కు అడ్డంగా కూర్చున్న స్థానికులు



శ్రీలక్ష్మీనగర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్లు

క్లుప్తంగా

27 నుంచి నోటి క్యాన్సర్ అవగాహన వారోత్సవాలు

కొమ్మాది: రుషికొండలో గల గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో ఈ నెల 27 నుంచి వారం రోజులపాటు గీతం దంత కళాశాల ఆస్పత్రి, గీతం వైద్య కళాశాలలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని డా. మణీష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నోటి క్యాన్సర్‌పై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పొగాకు వాడుతున్నవారు ముందు జాగ్రత్తగా ఈ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా రాబోవు ప్రమాదాన్ని తెలుసుకుని తగిన చికిత్సతో జాగ్రత్త పడవచ్చునని తెలిపారు.

శాస్త్రీయ నృత్య పోటీల్లో చిట్టివలస చిన్నారుల ప్రతిభ



మొదటి బహుమతి సాధించిన చిట్టివలస భారతీయ నటరాజ నృత్య నిలయం విద్యార్థులు

తగరపువలస : సమ్మర్ ధమాకా కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో ఈ నెల 21న జరిగిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీల్లో చిట్టివలస విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. భారతీయ నటరాజ నృత్య నిలయానికి చెందిన జస్మిత బహుమతి సాధించింది. అలాగే హారిణి, భవిష్య, కీర్తిలకు ప్రత్యేక బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా విద్యార్థులను, నృత్య నిలయం నిర్వాహకులను పెంట వెంకటరమణ శర్మ, తదితరులు అభినందించారు.

ప్రమాదకరంగా తాటితూరు కూడలి



తాటితూరు బీటీ రోడ్డు నుంచి ఎత్తులో ఉన్న మహరాజుపేట - పద్మనాభం సీసీ రోడ్డు

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు కూడలిలో రెండు రహదారులు కలిసేచోట ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. మహారాజుపేట – పద్మనాభం సీసీ రోడ్డుకు అనుసంధానంగా భీమిలి మండలం తాటితూరు బీటీ రోడ్డు ఉంది. ఈ రెండు మార్గాలు కలిసే కూడలి గతంలో వర్షాల సమయంలో కోతకు గురవడంతో పంచాయతీ పాలకవర్గం తాత్కాలికంగా గ్రావెల్‌తో సరిచేశారు. అయినప్పటికీ వాహనాల రాకపోకల కారణంగా గ్రావెల్‌తో సరిచేసిన భాగం కూడా కరిగిపోతోంది. దీంతో సీసీ రోడ్డు మీద నుంచి చాలా వరకు వాహనాలు ఇరువైపులా వేగంగా రాకపోకలు సాగిస్తుండగా ఇదే మార్గం నుంచి తాటితూరు వైపు రాకపోకలు సాగించే వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఈ రెండు రహదారులకు అనుసంధానంగా ఉన్న కూడలి ఎత్తుపల్లాలతో ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు ఒరిగిపోతున్నాయి. వీటిని నివారించడానికి రెండు మార్గాలు కలిసే కూడలిని కాంక్రీట్‌తో ఏటవాలుగా శాశ్వతంగా ఉండేలా నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. అంతేకాకుండా ఈ రెండు రహదారులపై కూడలి వద్ద హెచ్చరిక బోర్డులు ఉంచాలని కోరుతున్నారు.

తెలగా సేవా సంఘం అధ్యక్షునిగా రాంబాబు



సమావేశంలో తెలగా సేవా సంఘం ప్రతినిధులు

తగరపువలస : చిట్టివలస తెలగా సేవా సంఘం అధ్యక్షునిగా రంగూరి సీతారామ దొర అలియాస్ రాంబాబును పాలకవర్గం ఎన్నుకుంది. బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కార్యదర్శిగా నార్ల వాసు, సంయుక్త కార్యదర్శిగా తమ్మిన సూర్యప్రకాష్ ఎన్నికయ్యారు. సంఘ ప్రతినిధులు అల్లు బాబూరావు, సుంకర రామ్‌ప్రసాద్, రంగూరి రామ్‌కుమార్, నక్కాన గోవింద్, రంగూరి సాధు సుందర్‌సింగ్, బండారు ఎల్లాజీరావు, రంగూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమించి బడ్డీ ఏర్పాటు



కొమ్మాది జంక్షన్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బడ్డీ

మధురవాడ : ప్రభుత్వ స్థలాలతోపాటు ఖాళీగా కనిపించే జంక్షన్లలోని ఫుట్‌పాత్‌లనూ ఆక్రమణదారులు వదలడం లేదు. జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్‌లో సిగ్నల్ వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బడ్డీనే ఇందుకు నిదర్శనం. ఓ వ్యక్తి అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై హెచ్‌టీ విద్యుత్ లైన్‌ల కింద ఐరన్ రేకుల బడ్డీ బుధవారం సాయంత్రం ఏర్పాటు చేశాడు. జీవీఎంసీ అధికారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రారంభించేసి వినియోగంలోకి తీసుకొచ్చేస్తారు. ఇప్పటికే ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండి, తరచూ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో పాదచారులు నడవడానికి కూడా ఏమాత్రం అవకాశం లేకుండాపోతోంది. బడ్డీ ఏర్పాటు వల్ల ఫుత్‌పాత్‌పై కనీసం రెండు అడుగులు కూడా స్థలం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

రేకుల షెడ్లు తొలగింపు



రేకుల షెడ్లు తొలగిస్తున్న సిబ్బంది

భీమునిపట్నం : భీమిలి పెద్దబజారులోని మార్కెట్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన రేకుల షెడ్లను అధికారులు బుధవారం సాయంత్రం తొలగించారు. ఇక్కడ కొద్ది రోజులుగా కొత్త మార్కెట్ నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి టౌన్ సర్వే నంబర్ 996లో ప్రభుత్వం స్థలం ఆక్రమించి కట్టిన షెడ్లను అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఇక్కడి స్థలాన్ని ఆక్రమించి కొందరు షెడ్లు నిర్మించుకున్నారని, వాటిని ఇప్పుడు తొలగించామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన వీఆర్‌వో అప్పారావు, సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు కాపులుప్పాడ రెవెన్యూ తిమ్మాపురంలో గ్రావెల్ మాఫియాపై రెవెన్యూ అధికారులు స్పందించారు. సొసైటీ పేరుతో పచ్చని కొండలను తొలిచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించి, ఆ స్థలాలు ఆక్రమించి, ఫ్లాట్స్‌గా విభజించి విక్రయిస్తున్న ఓ వ్యక్తి ఆక్రమణలపై 'తిమ్మాపురంలో గ్రావెల్ మాఫియా' అనే శీర్షికతో సాక్షి పత్రికలో సోమవారం ప్రచురించిన కథనానికి తహసీల్దార్ టి.గోవింద స్పందించి చర్యలు చేపట్టారు. తిమ్మాపురంలో గ్రావెల్ తరలించి చదును చేసిన స్థలంలో ఆర్‌డీవో భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.గోవింద మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కొండను తొలచడం, గ్రావెల్‌ను బయటకు తరలించడం వాస్తవమే అని తేలిందన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో జరుగుతున్న స్థలాల ఆక్రమణ, అనధికారిక షెడ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్నామని, వీటిపై ఓ నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. అయితే ముందుగా ఆక్రమణకు గురైన స్థలం సంరక్షణ కోసం కలెక్టర్ ఆదేశాలతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలో ఇక్కడ నిర్మించిన అనధికారిక నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. వీఆర్‌వో అప్పారావు, వీఆర్‌ఏ సురేష్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక వైఎస్సార్ క్రికెట్ స్టేడియం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ సప్తగిరి ఫీడర్ ఏరియాలో శుక్రవారం నిర్వాహణ పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ప్రకటించిన సమయంలో జీవీఎంసీ 8వ వార్డులోని తారకరామనగర్, బింద్రానగర్, సప్తగిరి కాలనీ, లా కాలేజీ రోడ్డు, చాణక్యపురి లే అవుట్, పీర్‌లెస్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ తెలిపారు.

కొత్తమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట గ్రామదేవత కొత్తమ్మతల్లి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జూన్ 7, 11న నిర్వహించే దుర్గాలమ్మ, కొత్తమ్మతల్లి పసుపు – కుంకుమ ఉత్సవాలకు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.

రాజ్యలక్ష్మి ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం : మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో మూడు రోజులు జరగనున్న రాజ్యలక్ష్మి ఉత్సవాలు బుధవారం తొలేళ్లతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. 13 ఏళ్ల తర్వాత ఉత్సవాలు నిర్వహించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామంలోని ఇళ్లన్నీ బంధుమిత్రులతో సందడిగా మారాయి. రాత్రి ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించారు.

పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయండి



మధురవాడ జోనల్ కార్యాలయంలో పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



ఐటీ సెజ్ సమీపంలో పార్కు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

- జోనల్ కార్యాలయం పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయం పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని మధురవాడ జోనల్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పునర్నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం అంతా ఆకర్షణీయమైన ఆకృతులతో నిర్మించాలని సూచించారు. ఆధునిక ఫర్నిచర్, విద్యుత్, కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయం పక్కన ఉన్న సౌకర్యం కేంద్రం (సిటిజన్ సర్వీస్ సెంటర్)ని పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఐటీ సెజ్ వద్ద ఉన్న ఆదిత్య అపార్ట్‌మెంట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఐటీ సెజ్ పార్కును సందర్శించి పార్కులోని పనులు, సమీపంలోని టెన్నిస్ కోర్టు పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు శాంతిరాజ్‌ను ఆదేశించారు. ఐటీ సెజ్ రోడ్డులో ఉన్న అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీహెచ్ సురేష్, ఏఎంహెచ్‌వో కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీతో చిరంజీవి చౌదరి భేటీ



చిరంజీవి చౌదరిని సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి సందర్శించారు. బుధవారం విశాఖలో సదస్సులో పాల్గొన్న ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. ఏయూ చారిత్రక నేపథ్యం, ప్రత్యేకతలను తెలుసుకున్నారు. ఏయూలో జరిగిన అభివృద్ధి, వర్సిటీ నలుమూలలా స్థాపించిన టెక్, ఫార్మా, ఫుడ్, మెరైన్ ఇంక్యుబేషన్ కేంద్రాల పనితీరు, ప్రగతిని వీసీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున చిరంజీవి చౌదరిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టీకల్చరల్ వర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

కనులపండువగా నరసింహ యజ్ఞం



అలంకరణలో నరసింహ స్వామి



హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గంభీరంలో నిర్వహిస్తున్న నరసింహ యజ్ఞం

తగరపువలస : ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం రోడ్డులోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నరసింహ యజ్ఞం వైభవంగా నిర్వహించారు. శాస్త్రబద్ధంగా అలంకరించిన యజ్ఞకుండినిపై వేదమంత్రాల నడుమ, వేద పండితులచే యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తదాస అంబరీష మాట్లాడుతూ నరసింహ స్వామి అవతార ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. నరసింహ లీలా ప్రవచనం, పూర్ణాహుతి, శాంతివచనం, మంగళహారతి, సంకీర్తన, సంప్రోక్షణ, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో శ్యామ మాధవ దాస, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది / పీఎం పాలెం : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో బుధవారం శ్రీ నరసింహ స్వామి చతుర్దశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో రాధాదామోదర్ స్వామిని అలంకరించారు. లోక కల్యాణం కోసం ఉదయం 10 గంటలకు నరసింహ యజ్ఞం నిర్వహించారు. సాయంత్రం డాక్టర్ నితాయిసేవిని ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. సాంబదాస్ ప్రభూజీ శ్రీ నరసింహ స్వామి, భక్త ప్రహ్లాదుని లీలలు వివరించారు. అనంతరం స్వామికి పిండి వంటలు నివేదించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

ఎన్ఆర్ఐ ఆస్పత్రి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన



బొట్ట అప్పయ్యమ్మ (ఫైల్)



ఆస్పత్రి సిబ్బందితో మృతురాలి కుటుంబ సభ్యుల వాగ్వాదం

తగరపువలస : గుండె శస్త్ర చికిత్స తర్వాత ఓ వృద్ధురాలు చనిపోవడంతో మృతురాలి బంధువులు ఎన్ఆర్ఐ ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. జీవీఎంసీ రెండో వార్డు సంతపేట గొల్లవీధికి చెందిన బొట్ట అప్పయ్యమ్మ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా ఆమె కుటుంబ సభ్యులు చికిత్స కోసం సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు ఆస్పత్రి వైద్యులు స్పందించి ఆమెకు రెండు స్టంట్లు వేయాలని... ఒకటి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వేస్తామని, మరొక స్టంట్‌కు రూ.35 వేలు డిమాండ్ చేసినట్టు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. దీనికి వారు అంగీకరించడంతో బుధవారం ఆమెకు స్టంట్లు వేశారు. కాసేపు బాగానే ఉన్న అప్పయ్యమ్మకు అంతలోనే ఊపిరి తీసుకోవడం కష్టం కావడంతో ఐసీయూలోకి తరలించారు. అక్కడ ఆమె సాయంత్రం మృతి చెందింది. డబ్బులు చెల్లించినా వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పయ్యమ్మ మృతి చెందినట్టు ఆమె బంధువులు వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది డబ్బులు ఇవ్వకుండానే అప్పయ్యమ్మ మృతదేహాన్ని ఇంటికి తరలించేలా చూస్తామని మంతనాలు సాగించారు. ఇంతలో మృతురాలి బంధువులు ఆగ్రహంతో అక్కడే ఉన్న రెండు పింగాణీ పూల కుండీలు పగలగొట్టడంతో ఆస్పత్రి సిబ్బంది భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ డి.రమేష్, ఎస్ఐ గంటా హరీష్ అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. చివరకు రెండో స్టంట్‌కు డబ్బులు తీసుకోకుండానే ఆస్పత్రి సిబ్బంది మృతదేహాన్ని బంధువులకు అప్పగించడంతో వివాదం సద్దుమణిగింది. దీనిపై ఆస్పత్రి సిబ్బంది మాట్లాడుతూ అప్పయ్యమ్మకు స్టంట్ వేస్తుండగా ప్రాణాపాయం సంభవించిందన్నారు. వైద్యులు ప్రాణాలు కాపాడేందుకే ప్రయత్నిస్తారని, కావాలని ఎవరి ప్రాణాలూ తీయరన్నారు. ఆస్పత్రుల్లో ఆస్తులు ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని... అయితే అప్పయ్యమ్మ మృతితో కుటుంబ సభ్యులు బాధలో ఉన్నందున వారిపై చర్యలు తీసుకోలేదన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

ఉక్కునగరం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సెక్టార్–1లో వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన ఆలయ గిరిప్రదక్షిణ వైభవంగా సాగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో గోవింద నామస్మరణతో గిరి మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమయపాలన పాటించాలి

జగదాంబ : పారిశుధ్య సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలోని 36వ వార్డులో సిబ్బంది హాజరు, పనితీరుపై ఆరా తీశారు. అన్ని వార్డుల్లో సిబ్బంది కచ్చితంగా ఉదయం 5.30 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు విధులకు హాజరవ్వాలన్నారు. లేని పక్షంలో రిజిస్టర్‌లో రాలేదని నమోదు చేయాలన్నారు. అదే విధంగా పారిశుధ్య సిబ్బంది విధుల సమయంలో యూనిఫాం వేసుకోవాలన్నారు. విధులకు వచ్చి సమయం వృథా చేయకుండా పనులు చేయాలన్నారు. సిబ్బందికి కావల్సిన పనిముట్లు పూర్తిస్థాయిలో ఉన్నాయా లేదా ఆరా తీశారు.

వికసించిన మే పుష్పాలు



ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతంలోని ఓ ఇంట్లో అరుదైన 'మే' పుష్పాలు వికసించాయి. స్థానిక ఈశ్వరినగర్‌లో కె.కృష్ణ పాత్రుడు ఇంటి ఆవరణలో ఆరేళ్ల క్రితం కేరళ నుంచి తీసుకొచ్చి మే పుష్పం విత్తనం నాటారు. అది ఐదేళ్లకు గత ఏడాది మేలో పువ్వు పూసింది. ఏడాది తర్వాత మళ్లీ బుధ వారం రెండు పువ్వులు పూసింది. ప్రతి సంవత్సరం మే నెలలో ఒకసారి మాత్రమే ఈ మొక్కకు పువ్వు పూయడం విశేషం. ఇవి వారం రోజులు వికసించి వుంటాయని ఆయన తెలిపా రు. అందమైన ఈ పువ్వులు చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

జీవవైవిధ్యంతోనే మానవాళి మనుగడ



సదస్సులో పాల్గొన్న శిక్షణార్థులు, నిర్వాహకులు

విశాఖ విద్య : మానవాళి మనుగడకు జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డైట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు, ప్రముఖ ఉపన్యాసకులు గొట్టేటి రవి అన్నారు. టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ శిక్షణలో భాగంగా బుధవారం వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ కాబోయే ఉపాధ్యాయులు ప్రకృతి పరిరక్షణ, దాని వినియోగం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయులందరికీ జీవ వైవిధ్యంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ శిక్షణార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన పర్యావరణ కార్యకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు డోల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.